# స్నేహమేరా జీవితం

-డా. కొఠారి వాణీచలపతిరావు

ఆరోజు మా ఆవిడ నేను ఆఫీసునుంచి వస్తూనే నామీద 'ధూమ్ ధామ్' అని ఎగిరింది. నేను చేసిన తప్ప ఏంటంటే "రజనీ! కాస్త టీ పెట్టి ఇస్తావా?" అని అడిగాను.

అంతే! వంద చదివింది.

"నేనూ మీలాగే ఆఫీసు నుంచి అలసిపోయి వచ్చాను. నాకన్నా ఓ గంట ముందు ఇంటికి వచ్చారుకదా! నేనే వచ్చి టీ పెట్టి ఇవ్వాలని అలాగే కూర్చొకుంటే వంటింట్లోకి వెళ్లి టీ పెట్టి మీరు త్రాగి, ఆ చేత్తోనే మరో కప్పె ఫ్లాస్కులో పోసి నాకోసం ఉంచొచ్చు కదా. మీ పురుషోత్తములకు వంటిల్లు అడుగుపెట్టకూడని నిషిద్ధస్థలమా?" అంటూ గడగడా మాట్లాడింది.

'అమ్మ బాబోయ్. ఈవిడగారికి మళ్లీ పూనకం వచ్చింది' అనుకుంటూ ఒక్క అంగలో కిచెన్‌లోకి గంతేసి స్టవ్ వెలిగించి టీకి నీళ్ళు పడేశాను.

అక్కడయినా నన్ను మనశ్శాంతిగా, ప్రశాంతంగా బ్రతకనిస్తుందా అంటే అదీలేదు. నా వెనకే వచ్చి మళ్ళీ ఒక క్లాసు పీకింది.

"మీ మగవాళ్లకు ఎందుకింత పురుషాహంకారమండీ. ఏం మీకేమయినా కొమ్ములున్నాయహ. ఎందులో మీరు మాకంటే ఎక్కువని? అసలు ఈ ఆధునికకాలం థియరీని బట్టి భార్యభర్తలంటే ఎలా ఉండాలో తెల్సా. స్నేహితుల్లా ఉండాలి. మన పక్క ఫ్లాటులో కొత్తగా దిగిన నేహ, సాగర్‌లను చూడండి. వాళ్లిద్దర్నీ చూస్తూంటే భార్యభర్తల్లా అనిపించరు. మంచిస్నేహితుల్లా, ప్రాణస్నేహితుల్లా ఉంటారు. నేనూ ఈ ఆధునికకాలంలో పుట్టకుండా పాతిక సంవత్సరాల వెనుక పుట్టి ఉంటే ఎంత బాగుండేది అనిపిస్తుంది?" అంది దిగులుగా.

"ఇప్పుడు చింతించి ఏం లాభమే?" అన్నాను ఓదార్పుగా.

అందులో తప్పుమాట ఏముందో నాకర్థంకాలేదు.

గుడ్లురిమి తినేసేలా నావంక చూసి "ఇదిగో ఇందుకే నేననేది మీకు పురుషాహంకారమని. ఏమన్నారు...ఏమన్నారు...మళ్లీ అనండి. చింతించి ఏం లాభమే అనా?. 'ఏ, ఏమే' అని పనిమనిషిని పిల్చినట్టు ఆ పిలుపేంటి అంత అలుసై పోయానా నేను మీకు? ఆ నేహ, సాగర్‌లు ఎంచక్కా ఒకరినొకరు పేర్లు పెట్టి పిలుచుకుంటారు. వినడానికి ఎంత చక్కగా ఉంటుందో" అంది తన్మయత్వంతో.

"మరి నువ్వు నన్ను పేరు పెట్టి పిలవడం లేదు కదా. ఏమండీ! అని గౌరవంగా పిలుస్తున్నావ్. అందుకే నేను పాత స్టయిల్లో ఏమే అని పిలుస్తున్నాను. అయినా నేహ, సాగర్ అన్నపేర్లు అందంగా, మోడ్రన్‌గా పిలవడానికి వీలుగా ఉన్నాయి కనుక వినడానికి కూడా బాగుంటాయి. కానీ నా పేరు పూర్ణచంద్రరావు, నీ పేరు సూర్యకాంతం. నా పేరు పిలవాలంటే నీకు నోరు తిరగదు. నాకు నీ పేరు పిలవాలంటే భయమూ, ఎవరన్నా విన్నారంటే దడుచుకుంటారని బెదురు" అన్నాను భయం నటిస్తూ.

"పాతికేళ్ళు వెనక పుట్టాం గనుక పేర్లు కాస్త పాత వాసన వస్తున్నమాట నిజమే. పిలవడానికి కన్వీనియెంట్‌గా లేకపోవడమూ వాస్తవమే. ఇలాంటి పేర్లు ఉన్నవాళ్లు షార్ట్ కట్‌పేరుతో పిలుచుకుంటారు. మిమ్మల్ని నేను 'పూర్ణా' అని, నన్ను మీరు 'సూర్యా' అని పిలవవచ్చు"

"కానీ నాకూ అదే సందేహం. నన్ను ఆడ అని నిన్ను మగ అని ఎక్కడ అనుకుంటారో వినేవాళ్లు అని" అని నేను సందేహం వ్యక్తం చేయగానే అదీ నిజమే అని దీర్ఘంగా నిట్టూర్చింది మా ఆవిడ.

"ఈజన్మకు ఇక ఇంతేలెండి. మనం స్నేహితుల్లా ఉండే యోగం లేదు" అని నిరాశకూడా పడిపోయింది.

"పేర్లు పెట్టి పిలుచుకోనంత మాత్రాన ఏం కొంప మునిగిపోయింది. ఫ్రెండ్స్‌లా ఉండడానికి ఇంకా ఇతర మార్గాలు ఎన్నిలేవు? మేము బాగా క్లోజ్ ఫ్రెండ్స్, మేం చాలా సన్నిహితులం అని చెప్పుకోవడానికి 'మేం ఒక కంచంలో తిని, ఒక మంచంలో పడుకునేవాళ్లం' అని కదా చెబుతారు. మనం ఒక మంచంలో ఎలాగూ పడుకుంటున్నాం. రేపటినుంచీ ఒక కంచంలోనే అన్నం పెట్టుకుని ఇద్దరం తినేద్దాం" అని నేను అనగానే ఆవిడ సిగ్గుతో మెలికలు తిరిగిపోయి "ఛీ! పాడు ఈడొచ్చిన పిల్లల ముందు అలా ఏం బాగుంటుంది?" అంది.

"అదే మరి నీతో వచ్చిన చావు. అన్నీ నువ్వే కావాలంటావ్. మళ్ళీ అంతలోనే నువ్వే వద్దంటావ్. సరే ఆ ఒక్కటీ వదిలేసి మిగతా వాటి గురించి ఆలోచిద్దాం. ఇక నుంచి మనం ఇద్దరం కలిసి ఎటువెళ్లినా రోడ్డు మీద చక్కగా చెట్టాపట్టాలు వేసుకుని నడుద్దాం. కాసేపు పోట్లాడుకుందాం. అంతలోనే కలిసిపోదాం. ఇకపోతే స్నేహితులంటే కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడునీడగా ఉండాలి. మనమూ అలాగే అవునోయ్ మనం ఆల్రెడీ అలాగే ఉంటున్నాం కదా. ఆమధ్య ఒకసారి నా కాలుబెణికి పాదం కింద పెట్టనీయకుండా నొప్పిచేస్తే నా చెయ్యి పట్టుకుని నీ భుజం ఆసరా ఇచ్చి బాత్‌రూంకి సైతం నువ్వు నడిపించుకుని ఎన్నిసార్లు తీసుకెళ్లలేదు..." అని నేను అంటుండగానే మా ఆవిడా అందుకుని "పోయిన నెలలో నాకు వేలు తెగి బొటబొటా రక్తం కారింది. డీప్‌గా తెగడంతో రెండుమూడురోజుల దాకా కుడిచేత్తో ఏ పనీ చేసుకోలేకపోయాను. అప్పుడు మీరు నాకు తలదువ్వడం, అన్నం తినిపించడం వంటి పనులు చేయలేదూ!" అంది.

"కదా...ఆ పనులు మనం పిల్లలతో కూడా చేయించుకోకుండా నాకు నువ్వు, నీకు నేనే ఎందుకు చేసుకున్నాం?"

".....?!"

"ఎందుకంటే భార్యభర్తల మైన మనం మనకు తెలియకుండానే స్నేహితుల్లాగా కూడా ఉంటాం కనుక"

"నిజమేనండోయ్" అంది మా ఆవిడ ఆశ్చర్యపోతూ.

"పిచ్చిదానా? స్నేహం అంటే ఏమిటి? అదీ ఒక రకం ప్రేమే. చనువు, అభిమానం, సమభావం వీటన్నింటి కలయికే స్నేహభావం. పూర్వకాలంలో ఆ కాలాన్ని బట్టి పురుషాధిక్యత, స్నేహభావం అంతర్వాహినిగా ప్రవహించి పైకి కనబడేదికాదు. ఇప్పుడు వేషభాషల్లోనూ, పిలుపులోనూ, సహజీవనంలోనూ భార్యభర్తలు ఇద్దరం సమానం అన్న భావాన్ని ప్రకటిస్తున్నారు, అనుభవిస్తున్నారూ కనుక వారిలోని స్నేహభావం ఇప్పుడు రెండునదుల సంగమంలా బైటికి కనిపిస్తూ ఉంది.

ఆలుమగలు స్నేహితుల్లా మెలగాలన్న కాన్సెప్ట్ అంతరార్థం ఇద్దరి సుఖసంతోషాలు, సుఖసంసారం ఇవే" అని నేను అనగానే మా ఆవిడ బోలెడు ఆనందపడిపోయి అమాంతం నన్ను చుట్టేసి "అయితే మనం ఫ్రెండ్సేనన్నమాట" అంది.



పిల్లలు వస్తున్న అలికిడి వినిపించడంతో చటుక్కున దూరమై-

"ఇప్పుడు మనం పోట్లాడుకుంటున్నట్టు నటించాలి" అంది.

"నటించడం ఎందుకు? మనకలవాటేగా" అన్నాను.

ఫక్కున నవ్వింది మా ఆవిడ ఉరఫ్ నా ఫ్రెండ్.

* * *

నాకో కొడుకు, కూతురు.

కొడుకు అరుణ్ ఇంటర్, కూతురు అఖిల టెన్త్ చదువుతున్నారు. కొడుకు నా భుజాలు దాటి ఎదిగిపోతే అఖిల మా ఆవిడ తలకూడా దాటి ఎదిగిపోయింది.

మావాడికి నా దగ్గర చనువు ఎక్కువే అని చెప్పాలి. నా షర్ట్ వేసుకుంటాడు. నా షూస్ వేసుకుంటాడు.

నాతో కలిసి బజారుకు వస్తాడు.

ఇదివరకు నేను బైక్ నడిపితే వాడు వెనుక కూర్చునేవాడు. ఇప్పుడు వాడు నడిపితే నేను వెనుక కూర్చుంటున్నాను.

"పిల్లల్ని మరీ అంత నెత్తికెక్కించుకోకండి. కాస్త తండ్రి భయం లేకపోతే మరీ ఆడింది ఆటగా, పాడింది పాటగా అయి కొరకరాని కొయ్యల్లా తయారవుతారు" అంటుంది మా ఆవిడ రజని.

అలా అంటుంది కానీ అఖిలను తనుమాత్రం నెత్తికెక్కించుకోదూ! ఈవిడ ఎక్కడకు వెళ్ళినా అఖిల ఆమె భుజాల మీద చేతులు వేసి నడుస్తుంటుంది.

వంటింట్లో సైతం వెనకాలే తిరుగుతూ స్కూలు కబుర్లు, వీధి కబుర్లు చెబుతూ కూరలు తరిగి ఇవ్వడమో, చపాతీలు వత్తి ఇవ్వడమో మిక్సీలో చట్నీ రుబ్బి ఇవ్వడమో వంటి పనులు చేసి పెడుతూ ఉంటుంది. ఈ తల్లీకూతుళ్ళు అంతగా గంటల తరబడి వంటింట్లో చేరి చెప్పుకునే కబుర్లేమిటో అని మధ్య మధ్య చాటుమాటుగా వింటూ ఉంటాను.

"మమ్మీ... ఈరోజు ఏమయిందో తెల్సా. బస్సులో వస్తుంటే కండక్టర్ నా బస్‌పాస్ చూసే నెపంతో నా చెయ్యిని తాకాడు అప్పుడు నేనేం చేశానో తెల్సా సేఫ్టీ పిన్ తీసి చేతిమీద గుచ్చాను. అమ్మా అంటూ పెద్ద కేకపెట్టాడు. ఇలాంటి వాళ్ల కోసమే ఎందుకయినా పనికొస్తుందని ఓ పిన్ నా స్కూలు బ్యాగ్ ఫ్రంట్ జిప్‌లో వడేసుకుంటాను" అంటోంది ఓరోజు. కూతురు చేసిన ఘనకార్యానికి తల్లి పగలబడి నవ్వింది.

మరో రోజు-

"మమ్మీ ఈరోజు మాక్లాసులో ఓ అబ్బాయి కారిడార్‌లో నేను నడుస్తుంటే నాదారికి అడ్డు వచ్చి 'ఐ లవ్‌యూ' అన్నాడు. చాచి ఒక్కటిచ్చాను. చెంప చేత్తో పట్టుకుని పరుగో పరుగు..." అని అంటుంటే "అఖిలా మరీ అంత ర్యాష్‌గా ప్రవర్తించి లేనిపోని సమస్యల్లో ఇరుక్కోకు. ఈ వయసులో ఇలాంటి న్యూసెన్స్‌లు సహజమే. జాగ్రత్తగా తెలివిగా ఎదుర్కోగలగాలి. నువ్వు చెంప దెబ్బ కొట్టిన ఆ అబ్బాయి కాస్త దుడుకుస్వభావం వాడయితే.." అంది రజని.

"అలా భయపడితే లాభం లేదమ్మా. ఇప్పుడు రోజులు మారాయి. ఆడపిల్లంటే అబల, అమాయకురాలు, పిరికిది అనుకునేరోజులు పోయాయి. ఎవడికి ఏ లెవెల్లో, ఎలా బుద్ధి చెప్పాలో అలా చెప్పకుంటే అలుసైపోవడమే కాదు, బతుకు దినదినగండమైపోతుంది" అంది అఖిల.

ఆ జవాబుతో రజని ఎంత సంతోషించిందో నాకు తెలియదు గానీ నేను మాత్రం తెగ మురిసిపోయాను నాకూతురి తెలివితేటలకు, ధైర్యానికి.

అఖిల తల్లితో ఏ దాపరికాలు, సందేహాలు లేకుండా అంత ఓపెన్‌గా తన అనుభవాలను చెప్పటం, తన భావాలను ఆమెతో షేర్ చేసుకోవడం నాకు ముచ్చట అనిపించింది. వాళ్లిద్దర్నీ చూస్తుంటే ఈమధ్య నాకు తల్లీకూతుళ్లలా అనిపించడం లేదు.

మంచి స్నేహితుల్లా అనిపిస్తున్నారు. అఖిల మాటలే కాదు చేష్టలూ అంతే! వాళ్ల అమ్మ ఏ కొత్తచీర కొనుక్కున్నా. ఏ కొత్త నగ కొనుక్కున్నా తనకు నచ్చితే చాలు "ఇది నాది...నువ్వు వేరేది కొనుక్కో' అని తనే ఆ చీరకట్టుకుని, ఆనగ పెట్టుకుని మురిసిపోతుంది.

అంతేకాదు అమ్మ వార్డ్‌రోబ్ తెరిచి అడపాదడపా తనకు నచ్చిన చీరలన్నీ జాతీయం చేసేస్తూ ఉంటుంది.


"నన్ను అసలు నా చీరలు కూడా కట్టుకోనీయవాసే" అని రజని ఉడుక్కుంటుంటే "నీకెందుకు....దానికిచ్చేసేయ్ ఈ చీర నీకన్నా దానికే బాగుంటుంది" అని మధ్యలో నేను వంతపాడుతూ తనని మరింత ఉడికిస్తూ ఉంటాను.

మా ఇంట్లో అందరం కలిసి భోజనం చేస్తాం.

అందరం కలిసి కబుర్లు చెప్పుకుంటాం.

ఏ నిర్ణయాలు తీసుకున్నా కలిపే తీసుకుంటాం.

ఒక్కోసారి మాకేమనిపిస్తుందంటే కుటుంబసభ్యుల్లా కాక నలుగురం



## ఇంగ్లీషు చిత్రంలో సెలీనా

న్యూజిలాండ్-ఆస్ట్రేలియాలకు చెందిన ఓ సంస్థ నిర్మించే ఇంగ్లీషు సినిమాలో సెలీనా జైట్లీ హీరోయిన్‌గా నటిస్తోంది. 'లవ్ హాజ్ నో లాంగ్వేజ్' అనే పేరుతో నిర్మించబోతున్న ఈ సినిమాలో సెలీనా భారతీయ అమ్మాయిగా కనిపించబోతోంది. బెన్‌మిచెల్ అనే ఆస్ట్రేలియన్ నటుడికి ఆమె జంటగా నటిస్తోందిట. ఈ లవ్ సబ్జెక్ట్‌తో ఇంటర్నేషనల్ స్థాయిలో ఎంత మంది హృదయాల్ని సెలీనా దోచుకుంటుందో వేచిచూద్దాం!



ఫ్రెండ్స్‌మి కలిసి ఒక ఇంట్లో ఉంటున్నట్లుగా అనిపిస్తుంది.

రజని భార్యాభర్తలంటే స్నేహితుల్లా ఉండాలని సాధిస్తూ, దెప్పుతూ మాటి మాటికీ గుర్తుచేసి మరీ ఆ చనువును నా నుంచి పొందుతూ ఉంటుంది.

కానీ మేం ఇద్దరం మాత్రం మా పిల్లలు అడగకుండానే గుర్తుచేయకుండానే వాళ్ళతో స్నేహంగా ఉండడం వాళ్ళు ఎదిగినప్పటినుంచీ అలవాటు చేసుకున్నాం.

మా పక్క ఫ్లాట్‌లో అద్దెకుండే నారాయణరావుగారు పిల్లల్ని ఎలా కంట్రోల్‌లో ఉంచాలో, తల్లిదండ్రులంటే ఎలా భయంతో గజగజలాడాలో ఆ విషయాలన్నీ నేను కనపడ్డప్పుడల్లా నాకు లెక్చర్ ఇస్తూ ఉంటారు.

ఆయన కలలో కూడా తన నాన్నతనాన్ని, తన పెద్దరికాన్ని, తన అధికారాన్ని మర్చిపోని మనిషిగా అనిపిస్తుంది.

పిల్లల్ని చిన్నతనంలో ఎంతగా కొట్టేవాడో ఓరోజు కథలుగా చెబుతుంటే నాకు చాలా చిన్నతనం అనిపించింది. ఆయన ఇంకా అన్నారు మావాడు నేను కోపం చేసినప్పుడల్లా "ఆ పక్కింటి అంకుల్ చూడు. వాళ్ల పిల్లలతో ఫ్రెండ్‌లా ఎంత సరదాగా ఉంటాడో. నిన్ను చూస్తే రాక్షసుడిని చూసినట్టు ఉంటుంది" అంటాడు.

ఈరోజుల్లో పిల్లలు పెద్దంతరం, చిన్నంతరం లేకుండా ఎలా ఎదిరించి మాట్లాడుతున్నారో చూశారా. మీరు కూడా పిల్లలకు మరీ అంత అలుసివ్వకండి. తరువాత బాధపడాల్సి వస్తుంది అని నాకో ఉచితసలహా కూడా ఇచ్చి వెళుతుంటాడు.

మారుతున్న కాలంతో పాటు మారలేని మనుషులకు చెప్పినా అర్థంకాదు. అయినా ఎదిగిన పిల్లలతో స్నేహంగా ఉండాలన్న విషయం సర్వకాలాలకూ వర్తించే వ్యవహారసూత్రం.

పక్కింటి నారాయణరావుగారు తన పిల్లలతో వ్యవహరించే తీరుకే నేను ఆశ్చర్యపోతుంటే ఆరోజు నా ఆహ్వానం మీద మా ఇంటికి భోజనానికి వచ్చిన మా కొలీగ్ కరుణాకర్ పిల్లల పెంపకం మీద నాకు చెప్పిన పాఠాలు నాకు మరింత ఆశ్చర్యాన్ని కలిగించాయి. ఆ రాత్రి-

"భోజనం వడ్డించమంటారా?" అని మా ఆవిడ అడగగానే నేను ఆయన వంక చూశాను లేద్దామా? అన్నట్లు.

ఆయన అదోరకంగా ముఖం పెట్టి "ఏమీలేదా?" అని అడిగాడు.

"ఏంకావాలి మీకు?" అని అడిగాడు.

"మందు...అదే విస్కీ, రమ్‌లాంటిది ఏదయినా. మీకు అలవాటులేదా?" అని అడిగాడు.

అబద్ధం చెప్పడానికి నాకు నోరు రాక "ఎప్పుడైనా ఏదయినా పార్టీల్లో కొంచెం అదీ ఏ నాలుగునెలలకో ఆరునెలలకో ఓసారి" అంటూ నసిగాను.

"ఇంకేం మరి?" అంటూ కరుణాకర్ తెగ సంబరపడిపోయాడు.

'నేను అలా అనకుండా ఉండాల్సింది. ఆపత్సమయంలో అబద్ధమాడితే తప్పేముంది? అది అలుసుగా తీసుకుని ఇప్పుడు ఇంట్లోనే దుకాణం పెట్టేస్తాడేమో మహానుభావుడు' అన్న ఆలోచన రాగానే తెగ కంగారుపడిపోయి ఇంట్లో తీసుకోను. పిల్లలున్నారు వాళ్లముందు మంచిగా ఉండదు కదా అని నేను మళ్లీ నసుగుతుంటే ఆయన నేను ఏదో పెద్ద జోకేసినట్టు పెద్దగా నవ్వాడు.

"నువ్వు మరీ సత్తెకాలం మనిషిలా ఉన్నావోయ్ పూర్ణచంద్రరావు. మనంత ఎదిగిన పిల్లల్ని మనం ఫ్రెండ్‌లా ట్రీట్ చేయాలి గానీ కొడుకులా, కూతురులా కాదు" అంటూండగా అనుకోకుండా మా అరుణ్ అటు వచ్చాడు ఏదో పని మీద.

మేం అక్కడ ఉన్నట్టు తెలియక వచ్చాడేమో మమ్మల్ని చూసి వెళ్లబోతుంటే-

"ఇదిగో బాబూ నీ పేరేమిటి అరుణ్ కదూ" అంటూ పిలిచాడు కరుణాకర్. ఇంటికి పెద్దవాళ్ళు ఎవరొచ్చినా రాగానే ఒకసారి బయటకు వచ్చి మేం పరిచయం చేయగానే నమస్కారం చేసి వెళ్లడం మా పిల్లలకు అలవాటు. ఇందాకటి కుటుంబ సభ్యుల పరిచయం గుర్తుండిపోయింది మా అబ్బాయి పేరు మా కొలీగ్‌కి.

"అవును అంకుల్" అంటూ దగ్గరికి వచ్చాడు అరుణ్.

"చూడు. దగ్గరలో ఎక్కడైనా పాన్ షాప్ ఉంటే ఓ విల్స్ సిగరెట్ ప్యాకెట్ తెచ్చిపెడతావూ" అన్నాడు వేళ్ల మధ్య వెలుగుతున్న సిగరెట్‌ను యాష్‌ట్రేలో వడేసి జేబులో నుంచి డబ్బులు తియ్యబోతూ.

ఊహించని ఆ సంఘటనకు తత్తరపడిపోయాను నేను.

మా అబ్బాయి ముందు నాకు సిగ్గనిపించింది. టీనేజ్ పిల్లవాడితో సిగరెట్ తెప్పించుకుంటున్న అతని కుసంస్కారం నాకు ఎంతమాత్రం నచ్చలేదు. మావాడూ బిత్తరపోయి నావంక బేలగా చూశాడు.

"కరుణాకర్ గారూ...నో...నో... వాడొద్దు. మనం వెళ్లి కొనుక్కుందాం" అన్నాను కుర్చీలోంచి లేస్తూ.

## అంతరించిపోతున్న పాండాలు

చైనాలో సిచువాన్ రాష్ట్రంలో చెంగ్డు రీసెర్చ్ బేస్‌లో ప్రపంచంలో పాండా జాతి అంతరించిపోతున్న నేపథ్యంలో పెద్ద పెద్ద పాండాలని సంరక్షిస్తున్నారు. ప్రస్తుతం సిచువాన్, గాన్సు, షాన్‌క్సి రాష్ట్రాలలో 1600



పాండాలున్నాయిట. జంతు ప్రదర్శనశాలల్లో 217 పాండాలు మాత్రమే ఉన్నాయిట. 2008లో చైనాలో జరగబోయే ఒలింపిక్స్‌లో ఆటల చిహ్నంగా పాండాని ఎన్నుకున్నారు.

-విమలారామం



ఇద్దరం వెళ్తే ఎలాగూ మందు సీసా కూడా వస్తుందని అనుకున్నాడో ఏమో మారుమాట్లాడకుండా లేచి నాతో బయటకు వచ్చాడు కరుణాకర్.

దారిపొడుగునా నాకు హితబోధ చేస్తూనే ఉన్నాడు.

'మందు పోయించందే వదిలేలా లేడు' అనుకుని ఇంట్లో అలాంటి సీన్లు పెట్టడం ఇష్టంలేక అతిథి కనుక అతన్ని బార్‌కు తీసుకెళ్లాను. మూడు పెగ్గులు తాగాడు కరుణాకర్.

అక్కడ మళ్లీ హితబోధ. ఈసారి పెద్దగొంతుతో చెప్పడం మొదలుపెట్టాడు.

"అయితే నువ్వింకా పాతకాలం పద్ధతులే పాటిస్తున్నావన్నమాట. పిల్లల ముందు మనం ఓపెన్‌గా ఉండాలి పూర్ణచంద్రరావ్. ఏదైనా దాచాలని చూస్తే వాళ్లకింకా కుతూహలం పెరుగుతుంది. మా అబ్బాయి నేనయితే ఫ్రెండ్స్‌లా ఉంటాం. ఇద్దరం కలిసి డ్రింక్ చేస్తాం తెల్సా నీకు!" అంటూ అదో ప్రతాపంలా గొప్పగా చెప్పాడు కరుణాకర్.


## అపురూప జంట

చైనాకి చెందిన బావ్ ష్యూన్ పొడవు 7 అడుగుల 9 అంగుళాలు. మంగోలియా జాతికి చెందిన పశువుల కాపరి అతను. ఎంతోకాలం పెళ్లి కాక పత్రికలకి ప్రకటనలిచ్చినా లాభం లేకపోయింది. గత సంవత్సరం ప్రపంచంలో అతి పొడవైన వ్యక్తిగా గిన్నీస్ బుక్‌లోకి ఎక్కాడు. ఒకసారి రెండు డాల్ఫిన్స్ ప్రమాదవశాత్తు ప్లాస్టిక్ సంచుల్ని మింగేస్తే తన పొడవైన చేతుల్ని వాటి నోళ్లల్లోకి పంపి ఆ సంచుల్ని బయటకు లాగి వాటిని రక్షించాడు. ఈ మంచి మనిషికి ఇటీవల అతని స్వంత ఊరు చిఫాంగ్‌కి చెందిన 28 సంవత్సరాల సియాఫుజువాన్ అనే అమ్మాయితో పెళ్లయింది. అతని వయసులో ఆమెది సగం వయస్సు. ఆమె ఎత్తు 5 అడుగుల 6 అంగుళాలు!

## కోరికల గుహ

జపాన్‌లోని క్యూటో నగరంలో 800 ఏళ్ల నాటి గుడిలో 'విష్ టన్నెల్' (కోరికల గుహ) అనేది ఉందిట. ఎన్‌రికీ అనే పూజా విధానంగా ఆ గుహ ద్వారా మోకాళ్లమీద పాకి వెళ్లిన వాళ్లకి వాళ్లు కోరుకున్న జీవిత భాగస్వామి దొరుకుతారని నమ్మకం. ప్రతి ఏటా ఈ టన్నెల్ ద్వారా 40,000 మంది పాకుతారుట.

-విమలారామం




మాటల మధ్యలో మాటిమాటికీ "అమెరికాలో అయితే అంతే తెల్సా! పద్దెనిమిదేళ్లు రాగానే పిల్లల్ని వాళ్ల ఇష్టానికి వాళ్లను వదిలేస్తారు" అంటూ అమెరికా కబుర్లు చెప్పడం మొదలుపెట్టాడు.

'ఎవరి పద్ధతులు వారివి. ఎక్కడి వాతావరణం అక్కడిది' అని మనసులో అనుకుని-

తండ్రి కొడుకుల స్నేహబంధానికి విపరీతార్థాన్ని చెబుతున్న ఆయన వంక అయిష్టంగా చూశాను.

'ఇలాంటి మనిషి అని తెలియక పిలిచి పొరపాటు చేశానే" అనిపించింది.

ఆ మర్నాడు కూడా నా భార్య, పిల్లల ముందు తలెత్తుకుని తిరగలేకపోయాను.

నా మనసులోని భావాలను, నా ముఖకవళికల్లో చదివి నా పిల్లలు అసలు ఏమీ జరగనట్టు మేమేమీ అనుకోవడం లేదన్నట్టు నాతో మరింత చనువుగా మెలిగి స్నేహపూర్వక వాతావరణాన్ని మామధ్య కల్పించారు.

దాంతో నాకు మనసు కాస్త తేలికపడ్డట్టు అయింది. ఆ రాత్రి నా అర్ధాంగి రజని-

"అనుకోకుండా ఒక్కోసారి ఇలాంటి మనుషులు తగులుతుంటారు. పిలిచాక భరించకతప్పదు. పిల్లలు అర్థంచేసుకుంటారు. ఏమీ అనుకోరులెండి" అంటూ తన ఓదార్పు మాటలతో నాకు కొంత ఉపశాంతిని కలిగించింది. ఆమె మాటల ప్రభావం నామీద పని చేసిందనే చెప్పాలి.

ఏది ఏమైనా నేను నార్మల్ స్థితికి రావడానికి రెండురోజులు పట్టింది.

* * *

ఓ ఈవినింగ్ అలా వాకింగ్‌కు వెళుతుంటే దారిలో ఓ వ్యక్తి సన్నగా, పొడుగ్గా రివటలా ఉన్నవాడు కనిపిస్తే తక్కున ఆగిపోయి అలాగే చూస్తూండిపోయాను.

అతనూ అలాగే ఆగిపోయి నా వంక చూస్తూ- "నువ్వు...నువ్వు పూర్ణచంద్రరావు కదూ?" అన్నాడు.

అదే టైంలో నేనూ "నువ్వు...నువ్వు రాఘువ కదూ" అన్నాను ఆశ్చర్యపోతూ.

ఇద్దరం ఒకరినొకరు గుర్తుపట్టగానే ఆరాటంగా దగ్గరికి వచ్చి ఒకరినొకరు కౌగిలించుకుని ఆనందభాష్పాలు రాల్చాం.

"బాగున్నావురా పూర్ణా?"

"బాగున్నాను...నువ్వెలా ఉన్నావ్?"

"ఇదిగో ఇలా ఉన్నాను..." అంటూ బక్కచిక్కిన తన శరీరాన్ని చూపాడు. ఎలా ఉండేవాడు ఎలా అయిపోయాడు నా బాల్యమిత్రుడు.

"ఏం చేస్తున్నావురా? పిల్లలెంతమంది" అని అడిగాను.

"స్కూలు టీచర్ని రా. ఐదుగురు పిల్లలు. నలుగురు ఆడపిల్లలు, ఒక మగపిల్లాడు. మగపిల్లాడు కావాలని మా ఆవిడ పట్టుబట్టడంతో అంతమందిని కనాల్సి వచ్చింది. నీకు?"

"ఇద్దరు. ఒక అమ్మాయి, ఒక అబ్బాయి"

"అదృష్టవంతుడివి" అన్నాడు.

అబ్బాయి ఉండడం వల్ల అలా అన్నాడని అనిపించి-

"ఇద్దరూ అమ్మాయిలే అయినా ఫుల్‌స్టాప్ పడిపోయేదే. ఇద్దరికన్నా ఎక్కువ వద్దని ముందే ప్లాన్ చేసుకున్నాం. మా ఇల్లు ఇక్కడే రా వెళ్దాం. ఎన్నాళ్ళయిందో కలిసి. మనం ఇలా ఇన్ని సంవత్సరాలు కలవకుండా ఉంటామని అనుకున్నామా అసలు ఏనాడైనా" అన్నాను ఆనందోద్వేగాలతో.

"నిజమేరా...ఆరోజులు మళ్ళీరావు. ఇప్పుడు ఏరా అని పిలుచుకోవడానికి ఒక్క మిత్రుడూ కరువయ్యాడు"

అలా ఇద్దరం కబుర్లు చెప్పుకుంటూ నడుస్తుంటే ఉండుండి ఓ అరటిపళ్ళ

దుకాణం దగ్గర తక్కున ఆగిపోయాడు రాఘవ.

"అబ్బాయ్ డజను ఎంత?" అని అడిగాడు.

"పదిరూపాయలు" అన్నాడు బండి అబ్బాయి.

"ఎనిమిదికి ఇస్తావా?" అని బేరమాడాడు నిర్మొహమాటంగా.

'రావు' అనబోయి "తీసుకోండి" అన్నాడు పండ్ల బండి అబ్బాయి.

అరటిపండ్ల కవర్ తీసుకుని నడుస్తూ "అరటిపండ్లకు ఇంకో పేరుంది తెలుసా? పేదవాడి ఆపిల్ అని" అంటూ ఉంటే నాకు బాధ అనిపించింది.

"ఎందుకురా ఇప్పుడివన్నీ?" అన్నాను.

"మిత్రుడి భార్యాపిల్లల్ని కలవబోతున్నాను. వట్టి చేతులతో ఎలా రాను?"

నా ట్రిబుల్ బెడ్‌రూం డీలక్స్ ఫ్లాట్ చూసి తెగ సంబరపడిపోయాడు రాఘవ.

ప్రేమగా, అభినందన పూర్వకంగా రాఘవ నా భుజాలను తట్టాడు.

నా భార్య ఆతిథ్యం, నా పిల్లల వినయవిధేయతలు వాడిని మరీ మరీ ఆకర్షించాయి.

"ఎంత ప్రశాంతంగా హాయిగా ఉందిరా మీ ఇంటి వాతావరణం. మా ఇల్లు కిష్కింధలా ఉంటుంది పిల్ల జనాలతో. మా ఇంటి గదులు రైల్వే ప్లాట్‌ఫారంను తలపిస్తూ ఉంటాయి చిందరవందరగా ఎక్కడంటే అక్కడ పడి దొర్లుతున్న సామాన్లతో..." అన్నాడు నవ్వుతూ.

రాఘవ నవ్వులో నాకెన్నో భావాలు, ఆ నవ్వు వెనుక మనశ్శాంతిని కోల్పోయిన అతని బహు సంతానపు సంసారం నాకు లీలగా కనిపించింది.

'ఎవరి ముందు దాపరికాలు ఉన్నా స్నేహితుని ముందు దాపరికాలుండవు' అన్న అనుభవజ్ఞుల మాటను ఆరోజు రాఘవ నిజం చేసినట్టు అనిపించింది.

అందరం కలిసి భోజనం చేశాం.

కబుర్లు చెప్పుకున్నాం.

మా గిల్లికజ్జాలు, మా తగవులాటలు, మా కొట్లాటలు, రోజుల తరబడి మాట్లాడుకోకుండా చేసిన మౌనదీక్షలు, దీక్ష విరమించిన రోజు మేము పొందిన అంతులేని ఆనందాలు ఇవన్నీ మా పిల్లలకు అత్యంత ఆసక్తిని కలిగించాయి.

అయినా అంతటితో ముగియలేదు మా సింహావలోకన కార్యక్రమం.

రాఘవ అన్నాడు-

"పూర్వం నీకు గుర్తుందో లేదో గానీ నాకు బాగా గుర్తుందిరా. నాకు పదేళ్ల వయసులో అకస్మాత్తుగా మా నాన్న చనిపోతే ఆరోజు నన్నెంతగా ఓదార్చావు నువ్వు. నాకెంత ధైర్యం చెప్పావు. నా కన్నీళ్ళు తుడిచావు. నాకు అన్నం తినిపించావు. 'నువ్వు ఏడిస్తే నాకు ఎలాగో ఉంది ఏడవకురా' అని బిక్కమొహం పెట్టావు" అని వాడు అంటుంటే 'అంతటి స్నేహం ఇన్నాళ్ళు ఈ కాలగమనంలో ఎందుకిలా దూరమయింది. నా జీవితాన్ని నేను నిర్మించుకునే పనిలో పడి ఈ మంచిమిత్రుణ్ణి మర్చిపోయానా?' అనిపించి అపరాధభావం వడిలోగట్టిన నిప్పులా నన్ను కాల్చేసింది. అయినా చేజారిన స్వర్గం మళ్ళీ దొరికినందుకు ఆనందమూ కలిగింది.

"ఇంక వెళ్ళొస్తాను. మా కిష్కింధకు మీరూ ఓసారి రండి" అంటూ లేచాడు రాఘవ.

వెళ్ళబోతున్న వాణ్ని ఆప్యాయంగా కౌగిలించుకున్నాను చేజారిన పెన్నిధి తిరిగి లభించిందన్న ఆనందంతో.

వాడికి నేను ఇవ్వగలిగిన మణిమాణిక్యాలు..ఆప్యాయత నిండిన ఆ కౌగిలి ఒక్కటే అనిపించింది.

రాఘవ వెళుతూ వెళుతూ-

"మీ ఇంట్లో...నీ స్నేహశీలతో మాటల్లో చెప్పడం సాధ్యంకాని నిధి ఏదో ఉందిరా. దాన్ని పొందడానికి నేను మళ్ళీ మళ్ళీ వస్తాను" రాఘవ వెళ్ళిపోయినా నా ఆలోచనలు మా స్నేహాన్ని వదిలిపోలేదు.

"స్నేహంలో ఇంత మాధుర్యం ఉంది. మమత ఉంది. చనువు, దగ్గరితనం ఉన్నాయి కనుకనే మానవసంబంధాలలోని ప్రతిబంధాన్ని స్నేహంతో ముడిపెట్టి స్నేహం అనే శంఖంలో పోసి అందరూ తృప్తి పడుతుంటారు. ఎంతో ఆనందాన్ని తమ స్వంతం చేసుకుంటూ ఉంటారు. భార్యభర్తలు స్నేహితుల్లా ఉండాలనుకుంటారు,

తల్లిదండ్రులూ తమ పిల్లలతో స్నేహంగా మెలగాలనుకుంటారు. ఇరుగు పొరుగు, అన్ని కులాలు, అన్ని మతాలు, అన్ని రాష్ట్రాలు, అన్ని దేశాలు స్నేహితుల్లా కలిసి మెలిసి సఖ్యతగా మెలగాలనుకుంటాయి. చెట్టపట్టాలేసుకుని జనులంతా కలిసి బతకాలని గురజాడ అన్నదీ స్నేహమాధుర్యాన్ని చూడడం వల్లే. 'స్నేహమేరా జీవితం, స్నేహమేరా శాశ్వతం' అని ఓ సినీ కవి పాట కట్టిందీ స్నేహానుభూతిలోని సర్వకాలీనతను, సర్వజనీనతను దృష్టిలో ఉంచుకునే.

★



## అప్పుడే ఏం తొందర...!

శిల్పాశెట్టి బ్రిటన్‌లో త్వరలోనే ఇండియన్ రెస్టారెంట్లను ప్రారంభించాలని సన్నాహాలు చేస్తున్న శిల్పకి ఇప్పుడు 31 ఏళ్ల వయసు. మరి ఇంకా పెళ్లి తొందరపడడం లేదేంటి? అంటే... పెళ్లి గురించి ఆలోచించడానికే నాకు టైము చాలడం లేదు. ఎన్నో యాక్టివిటీస్‌తో నిత్యం బిజీగా ఉంటున్నాను. అన్ని విధాలా తగిన వరుడు, ముఖ్యంగా 'మంచి నాన్న' అనిపించుకోదగిన వ్యక్తి తారసపడినప్పుడు చేసుకుంటాను. మంచి నాన్న ఎందుకంటున్నానంటే నాకు తగిన భర్తగానే కాదు, మా పిల్లలకు మంచి తండ్రిగా ఆయన పేరు తెచ్చుకోవాలిగదా అంటోంది శిల్పాశెట్టి చిలిపిగా.

